క్లుప్తంగా

నేడు 'భూ భారతి'పై అవగాహన సదస్సు

రేగొండ: భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నేడు (శుక్రవారం) రేగొండ రైతు వేదికలో, కొత్తపల్లిగోరి చిన్నకోడెపాక రైతువేదిలో నిర్వహించనున్నట్లు రేగొండ, కొత్తపల్లిగోరి తహసీల్దార్లు శ్వేత, వీరభద్రం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరు కానున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

రేపు కొయ్యూరులో..

మల్హర్: మండలంలోని కొయ్యూరు రైతు వేదికలో కొత్త రెవెన్యూ చట్టం భూభారతి–2025 చట్టంపై రేపు (శనివారం) అవగాహన సదుస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే సదస్సులో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. ఈ అవగాహన సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల రైతులు, రైతు సంఘాలు నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏన్కపల్లిలో గ్రామసభ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం ఏన్కపల్లి గ్రామ పంచాయతీలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా భూమి కోల్పోతున్న రైతులతో తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్ ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. గురువారం భూమి కోల్పోతున్న రైతుల వివరాలను, వారి పట్టా నంబర్లు గ్రామసభలో చదివి వినిపించారు. రైతుల వివరాలు, విస్తీర్ణంలో తప్పుగా నమోదైతే తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు తెలిపారు. భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామ సభలో గ్రామ ప్రజల నుండి అభ్యంతరాలు స్వీకరించారు. డీటీ కృష్ణ, ఏఈఈ భరత్, సీనియర్ అసిస్టెంట్ సౌభాగ్యవతి, కార్యదర్శి సతీష్ పాల్గొన్నారు.

పహల్గాం ఘటన పిరికిపంద చర్య

శాయంపేట : జమ్మూ, కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిపిన ఉగ్రదాడి పిరికిపంద చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అభివర్ణించారు. మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు ఇలాంటి దాడులతో భారతీయ స్ఫూర్తిని దెబ్బతీయలేరని పేర్కొన్నారు. ఉగ్రవాదంపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయకులు చల్లా చక్రపాణి, చిందం రవి, దుబాసి కృష్ణమూర్తి, నిమ్మల రమేష్, కొమ్ముల భాస్కర్, మారపల్లి రాజేందర్, రాజు, కట్టయ్య, కుమార్, జగన్, వీరన్న,రాము, రఫీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయుడు తిరుపతి ఆంగ్ల వ్యాకరణ పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో అత్యున్నత ప్రతిభ కనబర్చిన చెలకాని శ్రీజ, పవన్‌కుమార్, గీస గాయత్రిలకు పుస్తకాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, కోమల, ఈశ్వరమ్మ, సరోత్తంరెడ్డి, రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

మొగుళ్లపల్లి: మండలంలోని మేదేరమెట్ల గ్రామానికి చెందిన పైడిమల్ల ఐలయ్య బుధవారం రాత్రి తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. గాయాలు కావడంతో స్థానికులు పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జోరుగా 'బెల్ట్' దందా!

- సిండికేట్‌గా వైన్‌షాపుల యజమానులు
- పట్టించుకోని అధికారులు



మొగుళ్లపల్లి: మండలంలో అధికారికంగా ప్రభుత్వం అనుమతిపొందిన వైన్ షాపులు రెండు ఉంటే అనధికారికంగా ఏర్పాటు చేసిన బెల్ట్‌షాపులు 300లకు పైగా ఉంటాయి. వైన్ షాపుల యజమానులు సిండికేట్‌గా మారి గ్రామాల్లో గల్లీ గల్లీకి బెల్ట్ షాపులను ప్రొత్సహిస్తూ అధిక ధరలకు మద్యం విక్రయాలు చేస్తున్నారు. గ్రామాల్లో యువత చెంతనే మద్యం దొరుకుతుండంతో మత్తుకు బానిస అవుతున్నారు. అరికట్టాలని మహిళలు ఎంతచెప్పినా ప్రయోజనం లేదు. ఎవరూ ఎన్నిరకాలుగా ఆరోపణలు చేసినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో మద్యం అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోతుంది.

ఏటీఎంలా మద్యం షాపులు

గ్రామాల్లో మద్యం ఏరులైపారుతోంది. ఏటీఎంలా ఎక్కడ పడితే అక్కడ ఎప్పుడు పడితే అప్పుడు బెల్ట్ షాపుల్లో మద్యం విచ్చల విడిగా లభిస్తోంది. మండలంలోని ప్రతీ గ్రామంలో బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో 25 గ్రామపంచాయతీల్లో ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతుంది. మండల కేంద్రంలోని మద్యం దుకాణాల ద్వారా బెల్ట్‌షాపుల నిర్వహణ సాగుతోంది. మద్యం దుకాణదారులు మద్యాన్ని బెల్ట్‌షాపులకు అమ్ముతూ వ్యాపారాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం దుకాణాల్లో ఒక్కో బాటిల్‌పై రూ.15 నుంచి రూ.20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. వీటిని తీసుకెళ్లిన బెల్ట్‌షాపుల వారు గ్రామాల్లో మరో రూ.10 లాభం చూసుకొని మద్యం ప్రియులకు విక్రయిస్తున్నారు. దీంతో బెల్ట్ షాపుల్లో కొనుగోలు చేసే వారికి దాదాపు ఒక్కో బాటిల్‌కు రూ.30 అదనంగా చెల్లిస్తున్నారు. ఇంత జరుగుతున్నా నెలనెలా మాముళ్లు తీసుకుంటూ అధికారులు ఈ వ్యవహారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి బెల్టుషాపులను నియంత్రించాలని లేకపోతే పేద కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు దాపురిస్తాయని ఆయా గ్రామాల పెద్దలు, మహిళలు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం అమ్మకాలు నిర్వహించాలి. మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ రెట్లుతో అమ్మితే చర్యలు తీసుకుంటాం.

– రబ్బానీ, ఎక్సైజ్ ఎస్సై

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



గొల్లబుద్దారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. గురువారం భూపాలపల్లి మండంలోని అటవీ గ్రామాలైనా నాగారం, ఆజాంనగర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, గొల్లబుద్ధారం, న్యూ లంబాడి తండా, కమలాపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. వివిధ గ్రామాల్లో గన్నీ సంచుల కొరత ఉందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిష్కరించాలని సివిల్ సప్లై డీఎంను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్‌టీఏ మెంబర్ సుంకరి రామచంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేంద్రమే బాధ్యత వహించాలి

కాటారం: కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన దాడులకు కేంద్ర ప్రభుత్వం, కేంద్ర హోం శాఖ మంత్రి అమీత్‌షా నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని తెలంగాణ ప్రజాఫంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ డిమాండ్ చేశారు. మహాముత్తారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ.. పోలీస్ వేషంలో వచ్చి విచక్షణ రహితంగా పర్యాటకులపై బుల్లెట్ల వర్షం కురిపించిన పాకిస్తాన్ ప్రేరేపిత లస్కరే తోయిబా ఉగ్రవాదులను అంతమొందించాలన్నారు. ఉగ్రవాద దాడిలో మృతిచెందిన పౌరులకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.25 లక్షల పరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. ఉగ్రదాడికి కారణమైన పాక్ ప్రభుత్వాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఒంటరి చేయాలని, వాణిజ్య, వ్యాపార, పర్యాటక రంగాలపై ఆంక్షలు విధించాలని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని కట్టడి చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా ఈ ఘటనను ముక్తకంఠంతో ఖండించాలని కిరణ్ పిలుపునిచ్చారు.

మేకలు, గొర్రెల దొంగ అరెస్ట్

- కారు, రూ.20 వేల నగదు స్వాధీనం



అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై గోవర్ధన్

నల్లబెల్లి: మేకలు, గొర్రెల దొంగను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై గోవర్ధన్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం .. నల్లబెల్లి క్రాస్‌రోడ్డులో సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పోలీసులను చూసి కారు నడుపుతున్న ఓ వ్యక్తి కారును పక్కకు ఆపి భయంతో పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. ఘట్‌కేసర్‌కు చెందిన విద్యార్థి కొత్తకొండ వికాస్‌కుమార్ అని విచారణలో తేలింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం నిజాంపల్లి గ్రామానికి చెందిన సెంట్రింగ్ మేస్త్రీ బమ్మ తిరుపతితో కలిసి ఆత్మకూరు మండలం సీతారాంపూర్‌లో రెండు మేకలు, నల్లబెల్లి మండలం నందిగామలో రెండు మేకలు, రెండు గొర్రెలను దొంగిలించి అమ్ముకున్నట్లు వికాస్‌కుమార్ అంగీకరించాడు. మారుతి సుజుకీ కారు, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకుని వికాస్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు. బమ్మ తిరుపతి పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు. ఎస్సై వెంట హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, కానిస్టేబుల్ శ్రవణ్ ఉన్నారు.

నర్సరీ పరిశీలన



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ శ్రీకాంత్

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు గ్రామ పంచాయతీలో ఉన్న నర్సరీని ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు గురువారం పరిశీలించారు. నర్సరీలోని మొక్కలకు తప్పనిసరిగా ప్రతీ రోజు నీరు పెట్టాలన్నారు. మొరుమూరు గ్రామ పంచాయతీలోని బిజినేపల్లి గ్రామంలో ప్రజలకు తాగు నీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శైలజతో కలిసి ఆరా తీశారు. పంచాయతీ కార్య దర్శి కార్తీక్ ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

మొగుళ్లపల్లి: ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా వైద్యాశాఖ ఉద్యోగుల సంఘం నాయకురాలు రేష్మా తెలిపారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీఓ నంబర్ 317 రద్దు చేస్తామని ఎన్నిల సమయంలో హామీ ఇచ్చిందని తెలిపారు. వైద్యా శాఖ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిని డా.నాగరాణి, సూపర్ వైజర్ సునీత, జమున, ల్యాబ్ టెక్నీషియన్ సంపూర్ణ, స్టాఫ్ నర్స్ సరిత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు



ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్

ఎస్ఎస్‌తాడ్వాయి: గొత్తికోయగూడెంలో తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీఓ జాల శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని బయ్యక్కపేట సమీపంలోని ముసలమ్మపెంట గొత్తికోయగూడెంలోని గొత్తికోయల తాగునీటి కోసం సింథటిక్ వాటర్ ట్యాంక్‌ను ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో అధికారులు గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీఓ మాట్లాడుతూ.. ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో గూడెంలోని గోత్తికోయలు తాగునీటి సౌకర్యార్థం కలెక్టర్ ఆదేశాల మేరకు ట్యాంక్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గూడెంలో గొత్తికోయలు తాగునీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ నీటి ట్యాంకర్ ద్వారా ప్రతి రోజు ట్యాంక్‌లో నీటిని సరఫరా చేస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నవీన్, పంచాయతీ కారయదర్శి జ్ఞానేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



రేగొండ: ఎమ్మెల్యే సత్యనారాయణరావును శాలువతో సన్మానిస్తున్న మహిళలు



చిట్యాల: పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ: పెద్దమ్మతల్లి ఆశీస్సులు అందరు సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన పెద్దమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు బండారి దేవేందర్, ముడుతనపల్లి శంకర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే

చిట్యాల: మండలంలోని నవాబుపేటలో ముదిరాజ్‌ల ఆరాధ్య దైవమైన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గురువారం హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరిపై పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. చిట్యాల మార్కెట్ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి, జిల్లా నాయకులు మొకిరాల మధువంశీకృష్ణ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆశీస్సులు ఉండాలి

పెద్దమ్మతల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్సీ, శాసనమండలి వైస్‌చైర్మన్ బండ ప్రకాశ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో గురువారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో వారు వేర్వేరుగా పాల్గొని పూజలు చేశారు. పెద్దమ్మతల్లి దేవాలయానికి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తన వంతుగా రూ.50వేలు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్, మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ట సురేష్, మండల ప్రధాన కార్యదర్శి మడికొండ రవీందర్‌రావు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు సాద రాజేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పలిమెల: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు చలో వరంగల్ వాల్ పోస్టర్ గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షులు జవ్వాజి తిరుపతి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలోని ప్రజలు ఆగమయ్యే రోజులు వచ్చాయని, కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం దరఖాస్తుల పేరున ప్రజల సమయాన్ని వృథా చేయడమే తప్పా ఏ పథకం అమలు కావడం లేదన్నారు. కేసీఆర్ పెట్టిన పథకాలే నేటికి రాష్ట్ర ప్రజలకు శ్రీరామ రక్షగా నిలుస్తున్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షుడు లంగారి రవీందర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాగె సడవలి, మాజీ మార్కెట్ డైరెక్టర్ బొచ్చు తిరుపతి, పంకెన గ్రామ అధ్యక్షుడు మోతే కిష్టయ్య, సీనియర్ నాయకులు రాజయ్య, మోహన్, సురేష్, శంకరయ్య, సమ్మయ్య, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ



ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

భూపాలపల్లి అర్బన్: మండలంలోని గొల్లబుద్దారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందల రవీందర్ ఆదేశాల మేరకు పాఠశాల పరిధిలోని ఎనిమిది గ్రామాలకు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. తల్లిదండ్రులను కలిసి మార్కుల వివరాలు తెలియజేసి, వారి సామార్థ్యలను వివరించారు. హాజరుశాతం పెంచాలని కోరారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేరాలని, పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలు, విద్య వసతులను గురించి ఉపాధ్యాయులు గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, యాకుబ్‌పాషా, మల్లిఖార్జున్, రాణి, రాజకవిత, రవీందర్‌రెడ్డి, మధు, సృజన, షాహిద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో అంగన్‌వాడీ పిల్లలు

టేకుమట్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం లభిస్తుందని అంగన్‌వాడీ టీచర్ ఈర్ల పూర్ణిమ అన్నారు. మండలంలోని రామకిష్టాపూర్(టి)లో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ నర్సరీ వరకు పిల్లలకు క్రమ శిక్షణతో కూడిన విద్యనందిస్తున్నామన్నారు. అంతే కాకుండా పౌష్టికాహారాన్ని ప్రతీ రోజు అందిస్తూ పిల్లల ఆరోగ్యంపై ప్రతీ రోజు పర్యవేక్షిస్తుంటామని తెలిపారు. ఎప్పటికప్పుడు ఎత్తుకు తగ్గ బరువును కొలుస్తున్నామని, ఆట, పాటలతో కూడిన విద్యనందిస్తున్నామని అన్నారు. ఐదు సంవత్సరాల తర్వాత అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తే, ప్రీ ప్రైమరీ విద్యనందిస్తారని కావున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పిల్లలకు మోడల్ పట్టాలను అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమ, రజిత, ఆశా పావణి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంతో ఏజెన్సీ ప్రజల హర్షం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ములుగు రూరల్: మండలంలోని ఏజెన్సీ గ్రామాలకు జంగాపల్లి నుంచి అంకన్నగూడెం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పూర్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని రాయినిగూడెంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకుడు గుండబోయిన రవిగౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని పాదయాత్రలు చేసిన పట్టించుకోలేదని అన్నారు. బొగ్గుల వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎర్రబెల్లి దేవేందర్‌రావు, రాజు, నవీన మంకిడి సమ్మయ్య, లక్ష్మీ, రజిత, పద్మ, శోభ, తిరుపతి, రామారావు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుంతలమయంగా రోడ్డు



గుంతలమయంగా మారిన రహదారి



చెరుకూరు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

- అటవీ శాఖ అనుమతి రాక ఆగిన పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

వాజేడు: మండల పరిధిలోని చెరుకూరు నుంచి ధర్మవరం వరకు రహదారి గుంతలమయంగా ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పేరూరు నుంచి చెరుకూరు వరకు డబుల్ రోడ్డు మంజూరై పనులు పూర్తయ్యాయి. కానీ మధ్యలోని ధర్మవరం నుంచి చెరుకూరు వరకు అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో విస్తరణ పనులు ఆగిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా అటవీశాఖ నుంచి అనుమతులు రావడం లేదు. దీంతో సుమారు రెండు కిలో మీటర్ల రహదారి సింగిల్ రోడ్డు గానే ఉండి పోయింది. ఈ రహదారిపై వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇసుక క్వారీలు నడిచిన సమయంలో ఇసుక లారీలు కూడా వందల కొద్ది ఈ దారి నుంచే వెళ్తుంటాయి. ఈ రహదారిపై ప్రయాణం నరకంలా మారిందని, గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయమేస్తుందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు ఈ రహదారిని మరమ్మతులు చేయించాలని లేని పక్షంలో అటవీ అనుమతులు వచ్చేలా చూసి డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ధర్మవరం సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

రేగొండ: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దంపల్లిలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పెద్దంపల్లి గ్రామానికి చెందిన పసుల శంకరయ్య వ్యవసాయ బావి వద్ద ఎద్దులను మేతకు వదిలి పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేసేందుకు వెళ్లిన ఎద్దు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని రైతు తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.